క్లుప్తంగా

ద్విచక్ర వాహనం అపహరణ



గాంధీ నగర్‌లో ద్విచక్ర వాహనాన్ని తీసుకెళ్తున్న దొంగ

ధర్మవరం అర్బన్: పట్టణంలోని గాంధీనగర్‌లో ఆదివారం తెల్లవారుజామున గుర్తు తెలియని దొంగ ద్విచక్ర వాహనాన్ని అపహరించాడు. బాధితుడు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. గాంధీనగర్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ చేనేత నాయకుడు గుండా ఈశ్వరయ్య ఇంటి ముందు నిలిపిన ద్విచక్ర వాహనాన్ని ఆదివారం తెల్లవారుజామున ముఖానికి గుడ్డ కట్టుకున్న దొంగ ద్విచక్ర వాహనాన్ని తీసుకెళ్లాడు. దొంగతనం చేస్తున్న దృశ్యాలు అక్కడున్న సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. సీసీ కెమెరాల ఆధారంగా దొంగ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

అక్రమ విద్యుత్ కనెక్షన్ల తొలగింపు

తాడిమర్రి: మండల పరిధిలోని పడమటి చెరువులో కొందరు రైతులు ఏర్పాటు చేసుకున్న అక్రమ విద్యుత్ కనెక్షన్లను సోమవారం ట్రాన్స్‌కో అధికారులు తొలగించారు. ఇటీవల పడమటి చెరువులో అనధికారికంగా కొందరు రైతులు విద్యుత్ కనెక్షన్లు తీసుకున్నారని కొందరు రైతులు ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన ఏఈ మదన్‌మోహన్ సిబ్బందితో వెళ్లి అక్రమ విద్యుత్ కనెక్షన్లను తొలగించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ.. అక్రమంగా విద్యుత్ కనెక్షన్ తీసుకుంటే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అలాంటి వారు స్వచ్ఛందంగా కనెక్షన్లను తొలగించుకుని సహకరించాలని కోరారు.

వాహనదారులకు కౌన్సెలింగ్



వాహన చోదకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ నిరంజన్‌రెడ్డి

కదిరి అర్బన్: మండలంలోని కుమ్మరవాండ్లపల్లిలో కదిరి– రాయచోటి రహదారిపై డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ లేని వాహదారులకు రూరల్ అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ నిరంజన్‌రెడ్డి సోమవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. సీఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ తీసుకొని వాహనం నడపాలన్నారు. హెల్మెట్, సీట్ బెల్ట్ కలిగి ఉండాలన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



కారు ముందు భాగం దెబ్బతిన్న దృశ్యం

బత్తలపల్లి: అనంతపురం–కదిరి జాతీయ రహదారిపై మండల పరిధిలోని కోడేకండ్ల బస్టాప్ వద్ద సోమవారం పెను ప్రమాదం తప్పింది. బత్తలపల్లి పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కోడేకండ్ల గ్రామానికి చెందిన ట్రాక్టర్ మలుపు తిరుగుతుండగా కదిరి వైపు నుంచి అనంతపురం వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వారు క్షేమంగా బయటపడ్డారు. ఎవ్వరికి గాయాలు కాలేదు. కారు ముందు భాగం దెబ్బతింది. ప్రమాదంపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

జేసీబీ, ట్రాక్టర్ సీజ్



పోలీసుల అదుపులో ఉన్న జేసీబీ, ట్రాక్టర్

బత్తలపల్లి: మండలంలోని చిత్రావతి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న జేసీబీ, ట్రాక్టర్‌ను సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సోమశేఖర్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. చిత్రావతి నది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంతో పోలీసు సిబ్బందితో కలిసి దాడులు చేశామన్నారు. ఈ దాడుల్లో ఒక జేసీబీ, ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాటిని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామన్నారు. ఎవరైనా ఇసుక అక్రమంగా రవాణా చేస్తే కేసులు నమోదు చేయడంతో పాటు కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా దేవేంద్ర నాయక్

ఎన్‌పీకుంట: మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్ గా దేవేంద్రనాయక్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహించే తహసీల్దార్ నరేంద్రకుమార్ సెలవుపై వెళ్లడంతో డీటీగా విధులు నిర్వహించే దేవేంద్రనాయక్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

పాఠశాలల్లో దాహం కేకలు



- కొన్ని స్కూళ్లలో పనిచేయని వాటర్ ప్యూరిఫైయర్లు
- మరికొన్ని చోట్ల ఏర్పాటు చేయని అధికారులు
- తాగునీటి కోసం విద్యార్థుల అవస్థలు



ఎనుములపల్లి ఉన్నత పాఠశాలలో మరమ్మతుకు గురైన వాటర్ ప్యూరిఫైయర్

పుట్టపర్తి అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో వేసవికి ముందే దాహం కేకలు వినిపిస్తున్నాయి. మొదటి విడతలో నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలల్లో వాటర్ ప్యూరిఫైయర్లు ఏర్పాటు చేయడంతో మంచి నీటి ఇబ్బందులు తొలగాయి. అయితే వాటిని సైతం సక్రమంగా నిర్వహించలేక కూటమి ప్రభుత్వం చేతులెత్తేసింది.

ఇష్టానుసారంగా నియామకం

పాఠశాలల్లో మరుగుదొడ్లు శుభ్రం చేయడానికి, చెత్త ఊడ్చడానికి, మంచి నీటి ట్యాంకులు శుభ్రం చేయడానికి ఒక మనిషిని ఏర్పాటు చేశారు. అయితే గ్రామస్థాయి నాయకులు ఎవరిని పడితే వారిని నియమించడంతో వారు కూడా పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం వారికి రూ.6 వేలు ఇస్తుండటంతో టీడీపీ నాయకులు ఏకంగా తమ కార్యకర్తలను ఏర్పాటు చేశారు. కొన్ని పాఠశాలల్లో వారు కూడా లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

పుట్టపర్తి పరిధిలో 48 పాఠశాలలు

పుట్టపర్తి మండల వ్యాప్తంగా 10 ఉన్నత పాఠశాలలు, 1 అప్పర్ ప్రైమరీ, 37 ప్రాథమిక పాఠశాలలు మొత్తం కలిపి 48 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో మొదటి విడతగా నాడు–నేడు 17 పాఠశాలలు పూర్తి చేశారు. రెండో విడతలో 27 పాఠశాలల్లో మంజూరైనా పనులు ఇంకా పూర్తి కాలేదు. మొదటి విడతలో నాడు–నేడు కింద ఏర్పాటు చేసిన వాటర్ ప్యూరిఫైయర్లు మరమ్మతుకు గురైనవి నాలుగు ఉండగా, తక్కిన వాటిని సరిగ్గా వాడకపోవడంతో మూలనపడ్డాయి.

అన్ని చోట్లా ఇబ్బందులే..

చాలా పాఠశాలలకు సత్యసాయి వాటర్ సప్లయి అవుతోంది. అవి కూడా వారానికి 4 రోజులు వస్తుండడంతో వాటితోనే సరిపెట్టుకుంటున్నారు. ముఖ్యంగా సుమారు 600 మంది విద్యార్థులు ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో నిత్యం తాగునీటికి నరకం అనుభవిస్తున్నారు. అక్కడ ఎలాంటి వాటర్ ప్యూరిఫైయర్ లేదు కనీసం మోటర్ లేకపోవడంలే అవస్థ పడుతున్నారు. కొన్నిసార్లు ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్ స్వంత డబ్బులతో వాటర్‌క్యాన్ తెప్పించి విద్యార్థులకు అందించాల్సి వస్తోంది. అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని విద్యార్థులు వాపోతున్నారు. రెండో విడతలో నాడు–నేడు కింద మంజూరైన పాఠశాలల్లో సుమారు 27 పాఠశాలల్లో ప్యూరిఫైయర్లు లేవు. ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంలోని ఎనుములపల్లి ఉన్నత పాఠశాలలో ప్యూరిఫైయర్లకు ఒక రూం ఏర్పాటు చేశారు. దాని నుండి వచ్చే మంచి నీటిని ప్రతి విద్యార్థి వినియోగించడానికి వీలుంది. అయితే అది కాస్తా మరమ్మతుకు గురి కావడంతో మూలనపడింది. దీంతో సదరు పాఠశాలలో ఉన్న సుమారు 480 మంది విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. పాఠశాలకు వచ్చే మున్సిపల్ నీళ్లనే దిక్కవుతున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మోడల్ స్కూల్లోని సత్యసాయి వాటర్ ట్యాంక్

సత్యసాయి నీళ్లే మాకు శరణ్యం

వారంలో నాలుగు రోజులు సరఫరా అయ్యే సత్యసాయి నీళ్లే మాకు శరణ్యం. వాటినే తాగుతున్నాము. ఆ నీటి సరఫరా నిలిచిపోతే సమీపంలోని బావుల వద్దకు వెళ్లలేక అవస్థలు పడుతున్నాం. దాతలు ఎవరైనా ముందుకొచ్చి మా నీటి కష్టాలను తొలగించాలి.

– రాజు, విద్యార్థి, ఏపీ మోడల్‌స్కూల్, పుట్టపర్తి

అన్ని పాఠశాలల్లో ఏర్పాటు చేస్తాం

నాడు–నేడు కింద రెండో విడతలో మంజూరైన ప్రతి పాఠశాలలోనూ వాటర్ ప్యూరిఫైయర్ ప్లాంట్లు వచ్చాయి. వాటిని త్వరలోనే ఏర్పాటు చేస్తాము. మండలంలో 27 పాఠశాలలకు మంజూరయ్యాయి. వాటిని ఏర్పాటు చేసే మెకానిక్‌లు మడకశిర నియోజకవర్గంలో పని చేస్తున్నారు. వారు రాగానే పూర్తి చేస్తాము.

– ప్రసాద్, ఎంఈఓ, పుట్టపర్తి

అంబేడ్కర్ భవనం ఏర్పాటు చేయాలి



ఏఓ ఖతిజున్‌కుబ్రాకు వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎస్సీ, ఎస్టీ సెల్ నాయకులు

ధర్మవరం: పట్టణంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనం ఏర్పాటు చేయాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ, ఎస్టీ సెల్ నాయకులు కోరారు. సోమవారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఏఓ ఖతిజున్ కుబ్రాకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అంబేడ్కర్ భవనం నిర్మిస్తే ఎస్సీ, ఎస్టీల వివాహాది శుభకార్యాలు, కార్యక్రమాలకు ఉపయోగపడుతుందన్నారు. బడుగు బలహీన వర్గాలు ఉన్నతస్థాయిలో ఉండాలంటే అంబేడ్కర్ ఆశయాలు నెరవేర్చాలని సూచించారు. భవనం కోసం స్థలాన్ని కేటాయించకపోతే ఎస్సీ, ఎస్టీలను ఏకంగా చేసి ఉద్యమాలు చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ, ఎస్టీసెల్ నాయకులు చౌడప్ప, దేవరకొండ రమేష్, కుణుతూరు గోపాల్, గుజ్జల బొమ్మన్న, సాకే వెంకటేష్, ఎస్.రామంజినేయులు, మల్లెల పెద్దన్న, పోతల కుళ్లాయప్ప, ఆంజనేయులు, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

జీవితాలు నాశనం చేసుకోవద్దు

బత్తలపల్లి: గ్రామాల్లో ఇరుగు, పొరుగు వారితో రస్తా, భూ తగాదాలు పెట్టుకుని జీవితాలు నాశనం చేసుకోవద్దని సీఐ ప్రభాకర్, ఎస్‌ఐ సోమశేఖర్ గ్రామస్తులకు సూచించారు. సోమవారం మండలంలోని వెంకటగారిపల్లిలో పోలీసులు పర్యటించారు. రస్తా, భూ తగాదాలు ఏవిధంగా పరిష్కరించుకోవాలో వివరించారు. పెద్ద మనుషులు, రెవెన్యూ అధికారులు మధ్యవర్తిత్వంతో సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. భూ తగాదాలతో పెద్దలే కాక పిల్లలు సైతం ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. గ్రామాల్లో చిన్న చిన్న తగాదాలతో మనస్పర్థలు ఏర్పడి గొడవలకు దారి తీస్తాయన్నారు. అందరూ ప్రశాంత వాతావరణంలో జీవించడం నేర్చుకోవాలన్నారు. గ్రామాలు బాగుంటేనే మండలం బాగుంటుందన్నారు. గ్రామంలో రస్తా, భూ తగాదా ఉండి పైపులు ధ్వంసం చేసుకున్న ప్రదేశాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామంలో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి

తనకల్లు: మండలంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను కాపాడాలని సీపీఎం, కాంగ్రెస్, ప్రజా సంఘాల నాయకులు తహసీల్దార్ శోభా సువర్ణమ్మకు సోమవారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ తవళం, బొంతలపల్లి పంచాయతీల్లోని ప్రభుత్వ భూములు ఆక్రమించి ప్లాట్లు వేసి విక్రయిస్తున్నారన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శివన్న, తోపు పారేసు, రమణ, వేమన్న తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

నల్లచెరువు: మండల కేంద్రంలోని యోగి వేయన ఆలయంలో ఆర్డీటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఆర్డీటీ వ్యవస్థాపకుడు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. వేమన ఆలయం నుంచి వైఎస్సార్ కూడలి వరకూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎస్ ఆర్డీటీ కంట్రోలర్ ఉత్తన్న, ఆర్డీటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై రేపటి నుంచి శిక్షణ

ధర్మవరం రూరల్: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధ, గురువారాల్లో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సాయి మనోహర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ తరగతులకు మండల స్థాయి అధికారులు, డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు తదితరులు హాజరు కావాలన్నారు. శిక్షణకు వచ్చే వారు ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకురావాలన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



గర్భవతులకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం

చెన్నేకొత్తపల్లి: పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని రామగిరి సీఐ శ్రీధర్, మండల వైద్యాధికారి డాక్టర్ రవినాయక్ గర్భవతులకు సూచించారు. సోమవారం మండల పరిధిలోని నాగసముద్రం గేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన గర్భవతులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రతి నెల తొమ్మిదవ తేదీన ప్రధానమంత్రి సురక్ష మాతృ అభియాన్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని మండల వైద్యాధికారి డాక్టర్ రవినాయక్ తెలిపారు. ఇందులో భాగంగా హైరిస్క్ గర్భవతులను పరీక్షించి మందులను పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. వైద్య పరీక్షల నిమిత్తం వచ్చిన వారికి చెన్నేకొత్తపల్లి ఎస్‌ఐ సత్యనారాయణ భోజన వసతి కల్పించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

ధర్మవరం రూరల్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా వుండాలని రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు సూచించారు. మండల పరిధిలోని తుంపర్తి గ్రామంలో సోమవారం రాత్రి గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. ప్రజలు గొడవలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామంలో ఏదైనా సమస్య వస్తే పోలీసులకు తెలియజేయాలన్నారు. అదే విధంగా ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం సైబర్ నేరాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

వేతనాలు పెంచాలని కార్మికుల ధర్నా



మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న కార్మికులు

కదిరి టౌన్: మున్సిపల్ కార్యాలయంలో పనిచేసే ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసే అవుట్ సోర్సింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలని మున్సిపల్ కార్యాలయం ముందు సోమవారం ధర్నా చేశారు. పట్టణంలో మున్సిపల్ కార్యాలయం నుంచి టవర్‌క్లాక్, వేమారెడ్డి సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్, ఇందిరాగాంధీ సర్కిల్ మీదుగా మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. రూ.29 వేల వేతనాలు పెంచాలని కార్మికులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు గంగాద్రి, వెంకటస్వామి, అల్తాఫ్, బాబునాయక్, రామమ్మోహన్, రంగనాథ్, సరోజమ్మ,శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టులను పూడ్చేస్తున్న రియల్ వ్యాపారులు

- లే అవుట్‌ల కోసం రహదారుల పక్కన ఉన్న వాగులను చదును చేస్తున్న వైనం
- అక్రమంగా మట్టి తరలింపు



ముక్తాపురం సమీపంలో జాతీయ రహదారి పక్కన లే అవుట్ కోసం భూమిని చదును చేసిన దృశ్యం

కనగానపల్లి: ప్రకృతి ప్రసాదించిన గంగమ్మ తల్లి (నీటి)కి కూడా దారులు లేకుండా రియల్ వ్యాపారులు కల్వర్టులను పూడ్చేస్తున్నారు. మండలంలోని ముక్తాపురం గ్రామ సమీపంలో జాతీయ రహదారి పక్కన కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొత్తగా లే అవుట్లు వేస్తున్నారు. ప్రస్తుతం స్థానిక శివాలయం పక్కన వేస్తున్న లే అవుట్‌లో ప్లాట్లు వేసేందుకు భూమిని చదును చేస్తున్నారు. ఇందుకోసం జాతీయ రహదారి నుంచి లే అవుట్లలోకి వెళ్లేందుకు రహదారి పక్కన ఉన్న రోడ్డు పరంబోకే స్థలాన్ని కూడా చదును చేశారు. ఇందుకోసం ఈ స్థలాన్ని మట్టితో పూడ్చి వర్షపు నీరు వెళ్లే వాగులు, కల్వర్టులను పూర్తిగా మూసేస్తున్నారు. దీనివల్ల పైనుంచి వర్షపు నీటితో పాటు చెరువు మరవ నీరు కూడా రోడ్డుపై ప్రవహించాల్సి వస్తుందని స్థానికులు చెబుతున్నారు. ఈ గ్రామానికి సమీపంలోనే రహదారి పక్కన ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్ కోసం కూడా ఇలాగే కల్వర్టు మూసేశారన్నారు. దీనివల్ల రెండు నెలల క్రితం కురిసిన భారీ వర్షానికి చెరువు నిండి మరవ నీరంతా జాతీయ రహదారిపైకి రావటంతో ఒకరోజంతా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడిందని తెలిపారు.

చర్యలు శూన్యం..

లే అవుట్ల పక్కన వాగులు పూడ్చేందుకు రియల్ ఎస్టేట్ వ్యాపారులు సమీపంలోని కొండల్లో నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. ముక్తాపురంలో కొత్తగా వేస్తున్న లే అవుట్ కోసం గత రెండు రోజుల నుంచి సమీపంలోని ఎర్ర కొండ నుంచి ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా మట్టిని తీసుకొస్తున్నారు. మైనింగ్ అధికారుల నుంచి అనుమతులు కూడా తీసుకోకుండా అధికార పార్టీ నాయకుల అండదండలతో స్థానిక రెవెన్యూ అధికారులను కుమ్మక్కు చేసుకుని అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రధాన రహదారి పక్కనే పదుల సంఖ్యలో ట్రాక్టర్లను పెట్టి అక్రమంగా మట్టి తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవటం లేదని చెబుతున్నారు. దీనిపై తహసీల్దార్ జీ.వీ. ప్రసాద్‌ను సంప్రదించగా.. లే అవుట్ల కోసం అక్రమంగా మట్టి తరలింపుపై మాకు సమాచారం వచ్చిందని తెలిపారు. అక్రమ మట్టి తరలింపును ఆపాలని స్థానిక రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. తిరిగి అలాగే చేస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

నాటు సారా విక్రేతల అరెస్ట్

కదిరి అర్బన్: మండల పరిధిలోని బాలప్పగారిపల్లి తండాలో నాటు సారా విక్రయిస్తున్న గోపాల్‌నాయక్, బాలాజీనాయక్‌ను అరెస్టు చేసి, వారి నుంచి 20 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ వీరారెడ్డి సోమవారం తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు.

నేడు రెవెన్యూ సదస్సులు

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని మేడాపురం గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు జరుగుతుందని తహసీల్దార్ సురేష్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. భూ సమస్యలు ఉన్న రెవెన్యూ అధికారులకు వినతిపత్రాలు అందజేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని మేడాపురం రెవెన్యూ గ్రామ పరిధిలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పెద్దకోట్లలో..

తాడిమర్రి: మండలంలోని పెద్దకోట్ల గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ సచివాలయంలో జరగనున్న రెవిన్యూ సదస్సులో భూములకు సంబంధించిన సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

ముక్తాపురంలో..

కనగానపల్లి: మండలంలోని ముక్తాపురం గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జీ.వీ. ప్రసాద్ తెలిపారు. గ్రామంలోని రచ్చకట్ట వద్ద నిర్వహించే ఈ సదస్సు ద్వారా రైతుల భూ సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. అలాగే హౌసింగ్, రేషన్ కార్డులు, పింఛన్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు.

వరిలో పంటకోత ప్రయోగాలు

బత్తలపల్లి: మండలంలోని పోట్లమర్రి గ్రామంలో సర్వే నంబర్ 323–1 జ్వాలా ప్రభావతి సాగు చేసిన వరి పంటలో వ్యవసాయ శాఖ అధికారులు సోమవారం పంటకోత ప్రయోగం చేశారు. దిగుబడి 16 కేజీల 100 గ్రాములు వచ్చింది. అలాగే గరిశలపల్లిలో సర్వే నంబర్ 165–1 పోతలయ్య పొలంలో 11 కేజీల 300 గ్రాముల దిగుబడి వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ పంటకోత ప్రయోగాలు మండల వ్యవసాయాధికారి ఓబిరెడ్డి ఆధ్వర్యంలో ఏఎస్ఓ డాక్టర్ లక్ష్మీనరసింహశర్మ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈఓ ఉపేంద్రరెడ్డి, బీమా అధికారులు చంద్రమోహన్, మంజునాథ్, చాంద్‌బాషా, వీఎస్ఏ ముత్యాలప్ప, ఎంపీఈఓ రవి పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి గ్రామోత్సవం



అయ్యప్ప స్వామి ఊరేగింపు దృశ్యం

ఎన్‌పీకుంట: మండల కేంద్రంలో సోమవారం రాత్రి అయ్యప్పస్వామి గ్రామోత్సవాన్ని అయ్యప్ప మాలధారులు నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్పగుట్టపై కొలువైన అయ్యప్ప స్వామి మూలవిరాట్‌కు నెయ్యి, గంధం, విభూది, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. మాలాధారుల శరణుఘోష నడుమ వేద మంత్రోచ్చారణలతో పూజలు నిర్వహించి, వీధులలో స్వామిని ఊరేగించారు. సింగిల్ విండో అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, గురుస్వామి రఘునాథ పాల్గొన్నారు.

అయ్యప్ప మండల పూజ

తలుపుల: ఓబీఆర్ రోడ్డులోని అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం గురుస్వామి రామాచారి ఆధ్వర్యంలో మండల పూజ నిర్వహించారు. ఉదయం నుంచి మాలధారులతో భజనలు, హోమాలు చేసి, భిక్ష ఏర్పాటు చేశారు. అనంతరం అయ్యప్ప విగ్రహాన్ని ఊరేగించారు.

14న అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

కదిరి అర్బన్: స్థానిక కదిరి డిపో నుంచి ఈ నెల 14న అరుణాచలం గిరి ప్రదక్షిణకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులు నడుపుతున్నట్లు డీఎం మైనుద్దీన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు బస్టాండ్‌లో బస్సు బయల్దేరుతుందన్నారు. తొలుత గోల్డెన్ టెంపుల్‌ను దర్శించుకొని, అనంతరం అరుణాచలం వెళ్లనున్నట్లు తెలిపారు. నల్లచెరువు, తనకల్లు, మొలకలచెరువు, అంగళ్లలో బోర్డింగ్ పాయింట్ ఉంటుదన్నారు. ఒకే గ్రామం నుంచి 40 మంది పైబడి భక్తులుంటే అదే గ్రామానికి బస్సు పంపిస్తామన్నారు. సూపర్ లగ్జరీలో చార్జీ ధర రూ.1,140 ఉంటుందన్నారు. ఆన్‌లైన్ సర్వీసు బస్సు నంబర్ 15303 ఫోన్ పే ద్వారా టికెట్, ఇతర వివరాలకు సెల్: 9959225892లో సంప్రదించాలని కోరారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

తలుపుల: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యాధికారులు అఫ్తాఫ్, అశ్రీత ఆధ్వర్యంలో గర్భిణులకు సోమవారం 57 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో 11 మంది రక్త హీనతతో ఉన్నట్లు గుర్తించారు. 9 మందిని ఉచిత అల్ట్రా సౌండ్ స్కానింగ్ కొరకు కదిరికి రెఫర్ చేసినట్లు వైద్యులు తెలిపారు.

నూతన ఎస్ఐగా ఇసాక్ బాషా



గాండ్లపెంట: మండల నూతన ఎస్‌ఐగా ఏ.ఇసాక్‌బాషా సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్‌ఐ గా పని చేసిన కృష్ణవేణి తాడిమర్రికి బదిలీపై వెళ్లారు. నూతన ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ, ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి విరాళం



ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం అందిస్తున్న డాక్టర్ బత్తల హరిప్రసాద్

గాండ్లపెంట: మండల కేంద్రానికి సమీపంలోని జగనన్న కాలనీ సమీపంలో చిన్న మిట్టవద్ద నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి కదిరికి చెందిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు డాక్టర్ బత్తల హరిప్రసాద్ ఆలయ కమిటీ సభ్యులకు సోమవారం రూ.లక్ష విరాళం అందించారు. ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులోనూ ఆలయ అభివృద్ధి కోసం సహకారం అందిస్తామన్నారు.

నివేశన స్థలాలు మంజూరు చేయండి

ఎన్‌పీకుంట: మండల కేంద్రంలో ప్రభుత్వ భూమిని గుర్తించి నివేశన స్థలాలు మంజూరు చేయించాలని అంబేడ్కర్ నగర్ కాలనీకి చెందిన ఎస్సీ సెల్ నాయకుడు రెడ్డప్ప కోరారు. సోమవారం ఇన్‌చార్జ్ తహసీల్దార్ దేవేంద్రనాయక్‌ను కలసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్డీటీ ఆధ్వర్యంలో సుమారు 125 కుటుంబాలకు ఇళ్లు నిర్మించి ఇవ్వడానికి ముందుకు వచ్చారన్నారు. ప్రభుత్వం భూమిని గుర్తించి నివేశన స్థలాలు కేటాయించాలని కోరారు. అలాగే మండల కేంద్రంలో అంబేడ్కర్ భవన్ నిర్మాణానికి ప్రభుత్వ స్థలం మంజూరు చేయాలని కోరారు.



